ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025



ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

వీరఘట్టం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ సాధించాలని డీఈవో ఎన్.తిరుపతినాయుడు అన్నారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. ప్రతిరోజూ ఒక్కో సబ్జెక్టు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఆ సమయాల్లో పాఠ్యాంశాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17న ప్రారంభవుతాయని తెలిపారు. ఎంఈవో ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇక్కడ చెరువులుండేవి!



● పంట పొలాలుగా కనిపిస్తున్న ఈ ప్రాంతం ఒకప్పుడు చెరువు. జియ్యమ్మవలస మండలం తుంబలి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 328లో గతంలో 7.44 ఎకరాల విస్తీర్ణంలో కొత్త చెరువు ఉండేది. ఇప్పుడు అక్కడ అసలు చెరువే లేదు. దీనిని చినతుంబలి, పెదతుంబలి, అల్లువాడ గ్రామాలకు చెందిన 18 మంది రైతులు పూర్తిగా వ్యవసాయ భూములుగా మార్చి సాగు చేసుకుంటున్నారు. ఇలా జిల్లాలో చాలావరకు చెరువులు కబ్జాకు గురై కనుమరుగైపోయాయి. అయినా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేదు.

● కబ్జాకు గురవుతున్న సాగునీటి వనరులు
● పొలాలుగా మార్చేస్తున్న ఆక్రమణదారులు
● కొన్నిచోట్ల ఇళ్లు, భవనాల నిర్మాణం
● పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చర్యలు తీసుకుంటాం

చెరువులు అనేవి సామాజిక ఆస్తుల్లో ఒకటి. వీటిని ఆక్రమించడం తీవ్ర నేరం. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడెక్కడ చెరువులు కబ్జాకు గురయ్యాయో గుర్తించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం.

-కె.హేమలత, డీఆర్వో,
పార్వతీపురం మన్యం జిల్లా.

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. చెరువులు, గుట్టలను సైతం వదలడం లేదు. వారి దెబ్బకు పలు చెరువులు కనుమరుగవుతున్నాయి. చెరువు గర్భాలను మట్టితో కప్పేసి పొలాలుగా మార్చేస్తున్నారు. అలాగే, ఇళ్లు, కమర్షియల్ భవనాలను నిర్మిస్తోన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ కబ్జా పర్వం మరింత ఎక్కువయ్యింది. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు శూన్యం. కూటమి ప్రభుత్వమైనా స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో చెరువుల పరిస్థితి

జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ డివిజన్ల పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. నీటి పారుదలశాఖ నివేదిక ప్రకారం మధ్యస్థ సాగునీటి విభాగం పరిధిలో మొత్తం వంద ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన చెరువులు 107 ఉన్నాయి. వీటి ద్వారా 21,591 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే వంద ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం కలిగిన 2,749 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 50,476 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇవి కాకుండా గెడ్డలు, ఆనకట్టలు, ఇతర వనరులు 59 ఉండగా, వీటి ద్వారా 23,395 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే, వీటిలో చాలా చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణదారులతో పాటు ఆయకట్టు రైతుల్లో కొందరు దొరికింది దొరికినట్లు ఆక్రమించేస్తున్నారు. కొన్ని చెరువులైతే కబ్జా చేసి ఇళ్ల స్థలాలుగా మార్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూశాఖ మాత్రం అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

కొన్ని ఉదాహరణలు..

● జియ్యమ్మవలస మండలం పరజపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 1లో 39 ఎకరాలతో పాటు తుమ్మలవలస గ్రామ పరిధిలో సర్వే నెంబర్లు 38/5, 34/1, 34/3, 29లో 27.09 ఎకరాలు కలిపి మొత్తం 60.09 ఎకరాల విస్తీర్ణంలో జగన్నాథసాగరం చెరువు ఉంది. వాస్తవానికి ఈ చెరువు విస్తీర్ణం మొత్తం వంద ఎకరాల పైమాటే. కానీ, కబ్జాల బారిన పడి సగం వరకు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

● సీతానగరం మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 18లో 26.97 ఎకరాల మావుళ్ల చెరువు ఉంది. ఇందులో కొంతభాగం వ్యవసాయ భూమిగా మారిపోయింది.

● సీతానగరం మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో వీరభద్ర చెరువు (పెద్ద చెరువు) ఉంది. సర్వే నెంబరు 3లో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం 34.25 ఎకరాలు. ఇందులో దాదాపు పది ఎకరాల వరకు కబ్జాకు గురైంది.

● గరుగుబిల్లి మండలంలో రావుపల్లి, గరుగుబిల్లి మధ్య ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువు కూడా భారీగా కబ్జాకు గురైంది. అలాగే కొత్తపల్లి, చినగుడబ, శివ్వాం, పోలినాయుడువలస గ్రామాల్లో ఉన్న చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో దాదాపు 30 శాతం వరకు చెరువులు కబ్జా కోరల్లో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రకారం కాకుండా గతంలో ఉన్న ఎస్ఎఫ్ఏల ఆధారంగా పరిశీలిస్తే చెరువులు ఎంతమేర ఆక్రమణకు గురయ్యాయో తెలుస్తుంది.

ఇలా చేస్తే మంచిది..

చెరువుల కబ్జాపై ఐదేళ్ల కిందట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అప్పటి ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి.. ప్రతి చెరువు కొలతలు చూసి హద్దులు వేసి కర్రలు పాతారు. కానీ, తరువాత అక్రమార్కులు ఆ కర్రలను తొలగించి యథావిధిగా వ్యవసాయం చేసుకుంటున్నారు. వాస్తవానికి రెవెన్యూశాఖ హద్దులు నిర్ణయించి కర్రలు పాతినప్పుడే అక్రమార్కులకు తగు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు అవసరమైతే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అప్పుడే వారు మరోసారి చెరువులను కబ్జా చేయకుండా ఉంటారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా చేడుతున్న చెరువు పనులతో రైతులకు (మిగతా 8వ పేజీలో..)

●ఇది కురుపాం మండల కేంద్రంలోని లంకెల చెరువు. సర్వే నెంబరు 69, 77/1లో రెవెన్యూ రికార్డు ఎస్ఎఫ్ఏ (సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్) ప్రకారం దీని విస్తీర్ణం 21.69 ఎకరాలు. ఈ చెరువుతో పాటు ఆర్అండ్‌బీకి చెందిన స్థలాలను 68 మంది కబ్జా చేసి ఇళ్లు, కమర్షియల్ భవనాలు నిర్మించారు. ఈ విషయం రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని, ఆక్రమణదారులకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి.



మామిడి, జీడికి మంచు దెబ్బ

● రాలిపోతున్న పూత ● విజృంభిస్తున్న తెగుళ్లు ● ఆందోళనలో రైతులు ● సస్యరక్షణ చర్యలు అవసరమంటున్న అధికారులు

కొమరాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో మామిడి, జీడి పంటలకు నష్టంవాటిల్లుతుంది. ప్రస్తుతం చెట్లన్నీ నిండా పూతతో ఉన్నాయి. ఇటువంటి తరుణంలో మంచు విపరీతంగా కురుస్తుండడంతో పూత రాలిపోవడంతో పాటు తెగుళ్ల విజృంభిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో జీడి, 38 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా డిసెంబరు మొదటి వారం నుంచే మామిడి, జీడి చెట్లకు పూత వస్తుంటుంది. కానీ గతేడాది నవంబరు, డిసెంబరులో వర్షాలు పడడంతో పూత రావడం కొంత ఆలస్యం జరిగింది. జనవరి నుంచి పూత పూయడం ప్రారంభించాయి. ప్రస్తుతం మామిడిలో రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాలకు సంబంధించి పూత వచ్చింది. మరికొన్ని రకాలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి. అయితే, వర్షాల కారణంగా కొంత పూత రాలిపోయింది. దీనికితోడు తేనె మంచు పురుగు సోకి పూత నాశనం అవుతోంది. అంత్రోక్నోజ్ అనే మచ్చ తెగులు కూడా సోకినట్టు రైతులు చెబుతున్నారు. తోటల్లో కలుపు ఎక్కువగా ఉండడంతో చాలా ప్రాంతాల్లో ఈ తెగళ్లు శరవేగంగా వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి సస్యరక్షణకు సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు.



మామిడి తోటల్లో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

సస్యరక్షణ చేపట్టాలి

మంచు కారణంగా మామిడిలో తామర, కాయ తొలుచు పురుగు, ఆకు మచ్చ, బూడిద తెగుళ్ల ఆశిస్తాయి. జీడి తోటలకు టీ దోమ, ఎరనల్లి కాండం తొలుచు పురుగు, పూత మాడు తెగులు ఆశిస్తాయి. రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వీటిని నియంత్రించడానికి పురుగు మందులతో పాటు పోషకాలు కూడా అందించాలి. మామిడి తోటలకు లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 5 గ్రాముల యూరియా కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారి చేయాలి. బోరాన్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటికి రెండు గ్రాములు చొప్పున బోరాన్ కలిపి పిచికారి చేయాలి. జీడి తోటల్లో పూతమాడు తెగులు నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము ఎస్‌ఫిట్ లేదా కార్బన్‌డైజేషన్ కలిపి చెట్టు మొత్తం తడిసేలా పిచికారి చేసుకోవాలి.

-క్రాంతికుమార్, ఉద్యానవనశాఖ అధికారి

మ్యుటేషన్లు పరిష్కరించాల్సిందే

● ఆలస్యమైతే చర్యలు తప్పవు ● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రీసర్వే రెవెన్యూ సదస్సులు, మీ సేవా పోర్టల్ ద్వారా వచ్చే మ్యుటేషన్లను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తహసీల్దార్లకు ఆదేశించారు. 30 రోజులు దాటి ఒక్కరోజు ఆలస్యమైన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కలెక్టర్ తన కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. దీనిపై సంబంధిత సబ్ కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. 'రీసర్వే, రెవెన్యూ గ్రామసభల్లో అనేక ఫిర్యాదులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈలోగా 1బీని భూ యజమానులకు అందించాలి. తద్వారా ప్రభుత్వం అందించే ఆర్థికసాయంతో పాటు రుణాలు తీసుకునేందుకు ఇతరత్రా వాటికి రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. రెవెన్యూ సదస్సుల్లో అధికంగా భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. అడంగల్, మ్యుటేషన్, 1బీ తదితర వాటిపై గ్రామ రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సరైన పరిష్కార మార్గాలను వివరించాలి.'అని సబ్ కలెక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, భూసర్వే, ల్యాండ్ రికార్డుల అధికారి, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వీడీవీకేల బలోపేతం

జిల్లాలో ప్రధానమంత్రి వన్‌ధన్ వికాస్ కేంద్రాల(వీడీవీకే) బలోపేతానికి అన్ని చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, గిరిజన సహకార కార్పొరేషన్ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారితో కలిసి సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 68, సీతంపేట ఐటీడీఏ పరిధిలో 54 వీడీవీకేలు ఉన్నాయి. ఈ రెండు ఐటీడీఏల పరిధిలో కొండచీపుర్లు, పసుపు, చింతపండు, జీడిపప్పు లభ్యత ఎక్కువగా ఉంది. నాణ్యమైన, పరిమాణాత్మక అటవీ ఉత్పత్తులు, బ్రాండింగ్, ప్యాకింగ్‌తో పాటు మంచి మార్కెటింగ్ కల్పించేందుకు అధికారులు నిర్ణయించారు. దీని కోసం గ్రూప్‌లకు యంత్ర పరికరాలు మంజూరు, అన్ని అంశాల్లో శిక్షణ అందించడంపై చర్చించారు. క్లస్టర్ల వారీగా యూనిట్లు ఏర్పాటు చేసి, మార్చి 15 నాటికి అన్ని రకాల యంత్రాలను సమకూర్చడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గాను గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 16 నుంచి 26 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న ఆది మహోత్సవాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పోర్టు ట్రస్టు, టాటా, టీటీడీ, ట్రైఫెడ్, ఏపీటీడీసీ తదితర సంస్థలతో సమన్వయం చేసుకుని ఉత్పత్తులను పెద్ద ఎత్తున విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పీవోలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జీసీసీ జీఎం సంధ్య, డీఎం వి.మహేంద్రకుమార్, ఏపీవో మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో ఏనుగులు



కోసలి సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

భామిని, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పగలంతా తోటల్లో తిష్ఠవేస్తున్న ఏనుగులు సాయంత్రం అయ్యాక పంట పొలాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. బుధవారం రాత్రి కోసలి సమీపంలో వలరౌతు వాసు, ఆఫీ, గోపాల్‌కు చెందిన మొక్కజొన్న పంటను తినడంతో పాటు నాశనం చేశాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటూ అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. చేతికి అందిన పంట నష్టపోతే ఎలా బతికేది అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏనుగులపై అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు రైతులకు సూచించారు. ఉదయం 8 గంటల వరకు పొలాల్లోనే సంచరిస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు పొలం పనులు చేయాలని బీట్ ఆఫీసర్ దాలినాయుడు సూచించారు. పంట నష్టాన్ని అటవీశాఖ సిబ్బంది జగదీష్, ఇందు పరిశీలించారు.



తోటపల్లికి ఉత్సవ కళ

● ఆలయానికి పోటెత్తిన భక్తులు
● నారాయణ మంత్రంతో మార్మోగిన పుణ్యక్షేత్రం

6లో

రైతుబజారు కల నెరవేరేదెప్పుడో!

● బొబ్బిలిలో కార్యరూపం దాల్చని నేతల హామీ
● కూరగాయల విక్రేతలు, వినియోగదారులకు అవస్థలు

6లో



సంధ్యారాణి స్థానం19

● మంత్రులకు ర్యాంకుల కేటాయించిన సీఎం చంద్రబాబు
● గేర్ మార్చాలి.. ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతంగా చేపట్టాలని ఆదేశం



పార్వతీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పని తీరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి 19వ స్థానంలో నిలిచారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ర్యాంకులను కేటాయించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన గుమ్మిడి సంధ్యారాణి వ్యవహరిస్తున్నారు. ఫైళ్ల క్లియరెన్స్, పనితీరుపై ఇచ్చిన ర్యాంకింగ్‌లో సంధ్యారాణి 19వ స్థానంలో ఉన్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇకపై రాష్ట్ర మంత్రులు గేరు మార్చాలని, ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగవంతంగా ఉండాలని మంత్రులను ఆదేశించారు. మంత్రుల పనితీరును ఇప్పటివరకు పెద్దగా పట్టించుకోలేదన్నారు. ఇక నుంచి వారిపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కీలక బాధ్యతలను మంత్రులకు అప్పగించారు.


ప్రతిష్ఠకు సిద్ధమైన విగ్రహాలు

తోటపల్లికి ఉత్సవ కళ

- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- నారాయణ మంత్రంతో మార్మోగిన పుణ్యక్షేత్రం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉభయ దేవస్థానాల పరిధిలో విగ్రహాల పునః ప్రతిష్ఠ, కుంభాభిషేకంతో పాటు స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ, తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు తరలివస్తున్నారు. తోటపల్లి ఆలయ ప్రాంగణం గురువారం నారాయణ మంత్రంతో మార్మోగింది. సుప్రభాతం, విష్ణు సూక్త పారాయణం, సేవాకాలం, ద్రవిడ ప్రబంధం, మండపారాధనలు, మూర్తి ప్రబంధం, ప్రాయశ్చిత్త హోమాలు, దాన్యాధివాసం, నీరాజనం తదితర పూజలను చేశారు. కేవీ నరసింహచార్యులు, జంధ్యాల జగన్నాథశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులుతో పాటు తిరుమల దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో ఈ పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయకుడు, సరస్వతీ దేవి, లక్ష్మీదేవిల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి నుంచి తీసుకువచ్చిన విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తోటపల్లి కిటకిటలాడుతోంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది గంట శ్రీధర్‌నాయుడు, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు, కె.శ్రీరామ్మూర్తి, ఎం.పకీరునాయుడు, తదితరులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


పూజలు చేస్తున్న భక్తులు


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



నూతనంగా నిర్మించిన దేవాలయం


ప్రతిష్ఠోత్సవానికి సిద్ధమైన విగ్రహాలు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

వంగర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కింజగి ఆర్‌అర్ కాలనీలోని కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. వేదపండితుడు అరసవెల్లి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు మహిళలు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయం వద్ద భక్తులు


రామతీర్థం దేవస్థానం


సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

రేపు సీతారాముల కల్యాణోత్సవం

- వేడుకలకు సిద్ధమైన రామతీర్థం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 8న సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. మామిడాకులు, కొబ్బరి ఈనెలు, పూలతో ఆలయాన్ని, కల్యాన వేదికను అలంకరించారు. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం నాడు దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు వివరించారు. ఈ ఉత్సవంలో భాగంగా సీతారామలక్ష్మణులను అశ్వ, గరుడ, హంస వాహనాలపై ఉంచి.. ప్రధాన వీధుల్లో ఊరేగించే ఎదురు సన్నాహ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. శ్రీరామచంద్రుడి తరఫున ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, లేదా వారి ప్రతినిధులు హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. సీతమ్మ తల్లి తరఫున పూసపాటిరేగకు చెందిన ఏకుల అప్పల స్వామి కుటుంబీకులు శతమానం, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కల్యాణోత్సవం జరుగుతుంది. స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, అర్చకులు ఖండవిల్లి కిరణ్, పాణంగిపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్ కుమార్, రామ్‌గోపాల్ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం..

రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలోని ఉమాసదాశివ స్వామి ఆలయంలో గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి ముందుగా దేవస్థానం క్షేత్ర పాలకుడు ఉమాసదాశివ స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి మల్లికార్జునశర్మ, ఈవో వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శివ పార్వతుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

రైతుబజారు కల నెరవేరేదెప్పుడో!

- బొబ్బిలిలో కార్యరూపం దాల్చని నేతల హామీ
- కూరగాయల విక్రేతలు, వినియోగదారులకు అవస్థలు


రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు కలగానే మిగిలింది. ఈ విషయంలో యంత్రాంగానికి చిత్తశుద్ధి కరువైంది. ఇక్కడ రైతుబజారు ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాంతీయుల చిరకాల కోరిక. రైతు బజారు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు నాయకులు హామీలు గుప్పించారు. ఆ హామీ అమలు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. పట్టణంలో సుమారు 75 వేలకు పైగా జనాభా ఉండగా... వివిధ మండలాలకు చెందిన వందలాది కుటుంబాల వారు బొబ్బిలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి నుంచి సుమారు పది మండలాలకు ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఇతర వర్గాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రైతు బజారు లేకపోవడంతో వినియోగదారులంతా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంత రైతులు కూడా సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవలసి వస్తోంది.

రోడ్డు పక్కనే విక్రయం..

స్థానిక చినబజారు జంక్షన్‌లో కూరగాయల మార్కెట్ ఉంది. మార్కెట్ బయట రోడ్లపై కూరగాయలు విక్రయించుకోవలసి వస్తోంది. బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కనే మండుటెండలో కూరగాయల రైతులు తమ పంటలను అమ్ముకుంటున్నారు. అలాగే కాలేజీ రోడ్డు, కృష్ణా టాకీస్ జంక్షన్... ఇలా వివిధ కూడళ్లలో రైతులు తాము పండించే కూరగాయలను అమ్ముకునేందుకు నిరీక్షించాల్సి వస్తోంది. కూరగాయల విక్రేతలకే కాకుండా కొనుగోలుదారులకు కూడా అవస్థలు తప్పడం లేదు. కొంతమంది రామభద్రపురం జంక్షన్‌లో కొనుగోలు చేసుకొని ఇక్కడ అమ్ముకుంటున్నారు. దళారీల ప్రమేయం ఎక్కువగా ఉంది. దీంతో అటు రైతులు, ఇటు వినియోగదారులు నష్టపోతున్నారు. రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు దొరుకుతాయి. తక్కువ ధరలకు లభించే అవకాశం ఉంటుంది.

అది తాత్కాలికమే...

పట్టణ ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన ఒత్తిడి మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన ఇంటి గోపాలరావు చొరవతో స్థానిక డీసీఎంఎస్ గోదాముల స్థలంలో తాత్కాలికంగా షెడ్లను నిర్మించి.. రైతు బజారును ఏర్పాటు చేశారు. అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పూర్తి స్థాయి రైతు బజారు ఏర్పాటు హామీలకే పరిమితమైంది. శాశ్వత ప్రాతిపదికన రైతుబజారును ఏర్పాటు చేయడంలో నాయకులు, అధికారులు విఫలమయ్యారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో స్థానిక మేదరబంద షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల బందను చదును చేసి రైతు బజారు ఏర్పాటు చేస్తామని హడావిడి చేశారు. నిబంధనల ప్రకారం చెరువులు, బందలను ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని ఉన్నతాధికారులు తేల్చేశారు. దీనికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వక పోడంతో ఆ ప్రతిపాదన కాస్త బుట్ట దాఖలైంది. పట్టణంలో అనేక చోట్ల ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిని వినియోగించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వ మైనా బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ధరలపై నియంత్రణ ఉంటుంది..



రైతు బజారు ఏర్పాటైతే సరసమైన ధరలకు కూరగాయలు అందుబాటులో ఉంటాయి. వీటిపై నియంత్రణ ఉంటుంది. కొనుగోలుదారులు ఒకేచోట అన్నిటినీ కొనుగోలు చేసుకోవచ్చు. దళారీల ప్రమేయం తగ్గుతుంది. కూరగాయలు పండించే రైతులకు కూడా వెసులుబాటుగా ఉంటుంది. నడిరోడ్లపైన ఎండలో, వానతో కూరగాయలు అమ్ముకునే దృశ్యాలు దయనీయంగా ఉన్నాయి.

-జి.అప్పలనాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రైతు బజారు ఎంతో అవసరం..

బొబ్బిలి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చాలా అవసరం. ప్రభుత్వం స్పందించి వెంటనే ఇక్కడ రైతు బజారును ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయయని పదేళ్ల నుంచి వింటున్నాం తప్పితే...కార్యరూపం దాల్చలేదు.

-గంజి కృష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగి

స్థల సమస్యే కారణం..

బొబ్బిలిలోఓ రైతు బజారు ఏర్పాటు కోసం ప్రభుత్వం దగ్గర ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. గతంలో ఎంపిక చేసిన స్థలాలకు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉన్నందున అక్కడ ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదు. తగిన స్థలాన్ని ఎంపిక చేసి అప్పగించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని కోరాం. వినియోగదారులకు అందుబాటులో ఉండే స్థలం సేకరణకు కసరత్తు చేస్తున్నాం.

-ఈశ్వరరావు, ఏఎంసీ కార్యదర్శి, బొబ్బిలి

భక్తులకు అసౌకర్యం కలగనీయవద్దు:ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం రోజున పుణ్యగిరి జాతర, జామి ఎల్లరమ్మ జాతరలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన నివాసంలో గురువారం ఆలయ కమిటీలతో సమావేశం నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు జాతరలకు భారీఎత్తున జనం వస్తారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనీయరాదన్నారు. భక్తులకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. దాతలు ముందుకొచ్చి భక్తులకు అన్నప్రసాద వితరణ, మజ్జిగ, తాగునీరు అందివ్వాలని పిలుపునిచ్చారు. పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. తలనీలాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రెండు జాతరలకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, వేపాడ నేతలు పాల్గొన్నారు.

అవి తగ్గిస్తే మంచిది

- రంగురంగుల కేక్‌లలో విష కారకాలు
- విచ్చలవిడిగా వినియోగంతో నష్టమే
- తూతూమంత్రంగా ఆహార భద్రత అధికారుల తనిఖీలు



గజపతినగరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కేక్‌ల ట్రెండ్ నడుస్తోంది. పండగైనా, పుట్టినరోజు అయినా పెళ్లయినా, వార్షికోత్సవమయినా విజయోత్సవమైనా మొదట కేక్ కట్ చేయడం ఆనవాయితీగా మారింది. ఈపరిస్థితుల్లో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను కలపడం కూడా అధికమయింది. వీటిని తింటే మధుమేహం, బీపీతోపాటు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ఆహారం నుంచి ప్రజలను రక్షించడానికి ఎన్నో చట్టాలున్నాయి. అధికారులు అమలు చేయడంలేదు. నిఘా పెట్టడం లేదు. తనిఖీలు లేవు. కొంతమంది వ్యాపారులు తమ స్వార్థం కోసం మరి కొంత మంది అవగాహనలేక కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

అద్దాల అరల్లో అందమైన విషం..

కార్పొరేట్ లుక్ కోసం అద్దాల అరలు ఏర్పాటు చేసి అందులో రంగురంగుల కేక్‌లు నిల్వ ఉంచుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకు స్థానికులే బేకరీలు నిర్వహంచేవారు. ఇప్పుడు కార్పొరేట్ బేకరీలు వస్తున్నాయి. పట్టణాలకే పరిమితమయిన బేకరీలు ప్రస్తుతం గ్రామాల్లోకి చేరుకున్నాయి. నాశిరకం రంగులతో కేక్‌లను తయారు చేసి వినియోగదారులకు ఆమ్మకాలు చేపడుతున్నారు. కేక్‌లు తినడం వల్ల చిన్నపిల్లలు గుండె జబ్బులకు, ఇతర వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో నెలరోజుల వరకు తయారు చేసిన కేక్‌లు నిల్వ ఉన్నా వాటిపై చర్యలు తీసుకోనే అధికారులు కరవయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనల అమలేది?

స్వీటు షాపు నిర్వాహకులు ఫుడ్ లైసెన్స్ తీసుకోకుండా చాటుమాటున అమ్మకాలు చేపడుతున్నారు. కేక్‌లు, స్వీట్లు, కవర్‌లు బాక్స్‌లపై వాటి తయారీ తేదీలను తప్పనిసరిగా ముద్రించాలి. కానీ అవేవీ ఉండవు. చాలా చోట్ల కేక్‌లు, స్వీట్లు తయారీలో అనుమతులు లేని రంగులు వాడుతున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఆహారభద్రతా అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో తనిఖీలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు.


విజయమే లక్ష్యం.. వృథా చేయం సమయం

- డీఎస్సీ కోసం అభ్యర్థుల సాధన


చదువులో నిమగ్నం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ఎలాగైనా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడమే లక్ష్యం'.. ఇదీ ఈ చిత్రాల్లో కనిపిస్తున్న అభ్యర్థుల మాట. అందుకు తగ్గట్టుగానే రోజంతా చదివే పనిలో నిమగ్నమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మార్చి నెలలో విడుదల కానుంద ని సమాచారం. చాలా ఏళ్ల తరువాత డీఎస్సీ నిర్వహించనుండడంతో నిరుద్యోగ అభ్యర్థులు విజయమే లక్ష్యంగా కష్టపడుతున్నారు. విజయనగరంలోని కేంద్ర గ్రంథాల యం, గురజాడ కళాక్షేత్రం వద్ద నిరుద్యోగ అభ్యర్థులు నిత్యం పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు. ఉదయాన్నే గ్రంథాలయం లోపలికి వెళ్లి.. పత్రికలు చదువుతున్నారు. ఆ తరువాత అక్కడే పుస్తకాలు చదువుకుంటున్నారు. కొంతమంది అభ్యర్థులు మధ్యాహ్న భోజనాలు చెట్ల కిందనే చేస్తుండడం గమనార్హం.




మిత్రులతో కలసి భోజనాలు చేస్తూ...

రేపు వెంకయ్యనాయుడు రాక

కొత్తవలస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం చింతలపాలెంలో నిర్వహించనున్న సాహిత్య గోష్ఠికి ముఖ్యఅతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరుకానున్నారని ఆహ్వాన సంఘం ప్రతినిధులు మాకెన నవీన్, మాకెన సీతారామపాత్రుడు, పిళ్లా దేశపాత్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఏటా గ్రామంలో చిట్టిపాప తీర్థం నిర్వహిస్తామన్నారు. తీర్థ మహోత్సవంలో భాగంగా తానా అవార్డు గ్రహీత బులుసు వెంకటేశ్వర్లు శాస్త్రితో రామాయణ కల్పవృక్షం కవితా వైభవంపై గోష్ఠి నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేత

కొత్తవలస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస జంక్షన్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జిని గురువారం రైల్వేశాఖ మూసేసింది. రైల్వే అండర్ బ్రిడ్జిపై పనులు చేస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి కింద నుంచి వాహనాల రాకపోకలను నిలిపేశారు. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సీతంపేట మీదుగా, మంగళపాలెం గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు వెళ్లే రోడ్డు దారిలో రాకపోకలు సాగించారు.

ఉపకరణాల పంపిణీకి ఎంపిక

కొత్తవలస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసేందుకు అర్హులను గుర్తించినట్టు మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్ బాబు ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని బుధ, గురువారాల్లో నిర్వహించామన్నారు. కోల్‌కత్తాకు చెందిన ఎన్ఎల్‌డీ సంస్థ, ఏపీ డిసెబుల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎంపికలు చేశామన్నారు. ఎంపికైన వారికిఅర్హతలను బట్టి మోటార్ ట్రైసైకిల్స్, వీల్‌చైర్స్, చెవిటి మిషన్లు, ట్రై సైకిల్స్, హ్యాండ్ క్రచెస్, వాకర్స్ అందిస్తామని ఆయన వివరించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా లఘు చిత్రం

చీపురుపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్న సందేశంతో పోలీసులు బుధవారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎల్.దామోదరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలకు యువత దూరంగా ఉండాలన్నారు. సంకల్పం పేరుతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏడీఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల్లో కోత తగదు

వంగర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సరుకులు మంజూరు చేయకుండా రేషన్ కార్డుదారులకు సరుకులు అందించమనటం తగదని ఎంపీపీ సురేష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం, కంది పప్పు పూర్తిస్థాయిలో డీలర్లకు అందజేయని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. తక్షణమే అధికారుల స్పందించి రేషన్ డిపోలకు పూర్తిస్థాయిలో సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నీ రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. సదానందేశ్వర, విజయకేశవస్వామి తీర్థ మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో కరిచిన్నయ్యపాలెం-రేగ, దేవరాపల్లి, గొల్లలపాలెం, మన్నిపాలెం-కొత్తవలస, ఉత్తరావల్లి-ఎల్.కోట, కల్లేపల్లి-కొత్తవలసరాంనగర్ జట్లు తలపడ్డాయి. ఇందులో కరిచిన్నయ్యపాలెం, దేవరాపల్లి, మన్నిపాలెం, ఉత్తరావల్లి, కల్లేపల్లి జట్లు విజేతలుగా నిలిచాయి.

ప్రణాళికా విభాగం కీలకం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధిలో ప్రణాళికా విభాగం ప్రముఖ భూమిక పోషించి నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆకాంక్షించారు. గురువారం పట్టణ ప్రణాళికా అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆయన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ హరిబాబు, డీటీసీపీ వో నాగలత, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వంగర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీఆర్‌పేట 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజులగుమ్మడకు వచ్చే 11 కేవీ ఫీడర్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేష్ ప్రకటనలో తెలిపారు. సీహెచ్ గుమ్మడ, రాజులగుమ్మడ, జేకే గుమ్మడ గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

●గంట్యాడ: అయ్యన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గుంకలాం రూరల్ ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలిగించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రామవరం, కరకవలస, కొత్తవెలగాడ, తాటిపూడి, మదనాపురం గ్రామాలు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డీఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సమాన వేతనాలివ్వాలి

కొత్తవలస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని యూనియన్ అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కొత్తవలసలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రభుత్వరంగ సంస్థలలో మూడు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఉద్యోగులకు గతంలో మినిమిమం టైమ్ స్కేల్ అమలు చేసేవారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మినిమం టైమ్ స్కేల్ నుంచి 5 నుంచి 12 వేల వరకు వేతనాలను తగ్గించిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని బొబ్బిలిలో చంద్రబాబు హామీ ఇచ్చిన ఆయన రెండు వారాలు కింద ఎంటీఎస్ వర్తించదంటూ జీవో నెంబరు 2ను విడుదల చేయడం సరైంది కాదన్నారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఆయనతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు ఉన్నారు.

నులి పురుగుల మాత్రలు వేయించండి

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుర్ల మండలంలో తప్ప జిల్లా అంతటా 10న డీ వార్మింగ్ డే సందర్భంగా 19 ఏళ్లలోపు వారితో అల్బెండజోల్ మాత్రలను వేయించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షలు 60 వేల మందికి ఈనెల 10న అన్ని పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని విద్యార్థులకు, బడి బయట ఉన్న 19 ఏళ్ల లోపు వారికి మాత్రలు వేయాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించాలన్నారు. సోమవారం మధ్యాహ్న భోజనం పూర్తి చేయించి మాత్రలు మిగించాలన్నారు. సాయంత్రం 4 గంటల వరకూ పరిశీలనలో ఉంచాలన్నారు. ఎటువంటి రియాక్షన్ వచ్చినా ఆస్పత్రులకు తరలించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం డయేరియా లేదని, ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా విరోచనాలు, వాంతుల లక్షణాలు ఉంటే అవి సాధారణంగా వచ్చినవేనని, డయేరియా వల్ల కాదన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు, సీపీవో బాలాజీ, డీఈవో మాణిక్యంనాయుడు, సమగ్రశిక్షా పీవో రామారావు తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ అంబేడ్కర్

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

విజయనగరం కలెక్టరేట్: నియోజకవర్గాలు వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ, రాష్ట్ర స్థితిగతులను మార్చేలా స్వర్ణాంధ్ర-2047 ప్లాన్ కోసం సిద్ధం చేసిన పది సూత్రాల ప్రణాళికను అధికారులంతా చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సున్నా పేదరికం కోసం పి4 విధానంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేసి వీటిని రూపొందించా లని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నిరు ఎంఎస్ఎంఈ సర్వేను మార్చి 15 నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ అంబేడ్కర్, సీపీవో బాలాజీ, జడ్పీ సీఈవో సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ మార్చి 8 వరకూ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లోనూ, పబ్లిక్ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు. విగ్రహాలకు ముసుగులు వేసే విధంగా మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో తుపాకుల లైసెన్స్ కలిగిన వ్యక్తుల నుంచి ఆయుదాలు డిపాజిట్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాన్ బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులపై విస్తృతంగా దాడులు నిర్వహించాలన్నారు. రాత్రి బీట్‌లు, పగల బీట్‌లు వేయాలని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను ముందుగా గుర్తించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు తీరును విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు పర్యవేక్షించా లని ఎస్పీ ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయండి: జేసీ



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ

బొండపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతాయని జేసీ సేతు మాధవన్ అన్నారు. గురువారం మండలంలో వివిధ శాఖల అధికారుల పనితీరు పరిశీలించి పలు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. తొలుత మార్కెట్ కమిటీ సముదాయంలో ఉన్న పౌర సరఫరాల గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచిత బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు చోటివ్వరాదని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ మీనాకుమారిని ఆదేశించారు. అనంతరం స్థానిక శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. దీపం పథకం లబ్ధిదారులకు ఉచిత సిలెండర్లు నమోదు, కేటాయింపు, అదనపు వసూళ్లు తదితర వివరాలను సెల్‌ఫోన్ ద్వారా లబ్ధిదారులకు అడిగారు. అలాగే బొండపలిలో ఎఫ్‌సీ దుఖాణం-17ను పరిశీలించారు. ఎండీయూ వాహనాన్ని పరిశీలించి బియ్యం నాణ్యత, పంచదార ప్యాకెట్ల బరువును సక్రమంగా ఉందా అని తూకం వేశారు. ఆయనతో పాటు జిల్లా తూనికల కొలతల అధికారి పి.వి.రంగారెడ్డి, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, సీఎస్ డీటీ తిరుపతిరావు ఉన్నారు.

జూట్ మిల్లు తెరిపించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ

నెల్లిమర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్ మిల్లు తెరిపించేందుకు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ.. ఎమ్మెల్యే లోకం నాగమాధవికి విజ్ఞప్తి చేశారు గురువారం ఆయన నెల్లిమర్ల నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆమెను కలిసి.. కార్మికుల దయనీయ స్థితిని వివరించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూర్లె శ్రీధర్, వైకుంఠరావు, సూర్యనారాయణమూర్తి, నడిపేన నారాయణమూర్తి, సురాల సూర్యనారాయణ, ఎస్‌వీ కృష్ణారావు, అల్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించండి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

నెల్లిమర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో మాణిక్యంనాయుడు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తరగతులకు శతశాతం విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు చేపట్టలన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మేలు.. లోకేశ్ ఉక్కు సంకల్పం

●ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రతో ప్రజాక్షేత్రంలో తనను తాను నిరూపించుకున్న నాయకుడు, మంత్రి నారా లోకేశ్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని టీడీపీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కొనియాడారు. గురువారం, ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రానికి మేలు చేయాలనే ఉక్కు సంకల్పంతో రాష్ట్రానికి చెందిన కూటమి నాయకులను కలుపుకొని కేంద్ర మంత్రులను కలిసి ప్రాజెక్టుల కోసం విజ్ఞప్తి చేయడం శుభపరిణామం. గత ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్ర పరిస్థితి వెంటిలేటర్ పెట్టే స్థాయికి చేరింది. ఆ దశలో రాష్ట్రంలో, దేశంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఏపీకి మళ్లీ మంచి రోజులు వచ్చాయి' అని ఎంపీ కలిశెట్టి అన్నారు.

ఎంపీజీ సేవలు ప్రశంసనీయం

● శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



కేక్ కట్ చేస్తున్న ఎంపీజీ ఈశ్వరరావు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేద శిష్టకరణ సంఘాల కుటుంబాలు, విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడంతో పాటు వారి అభివృద్ధికి శిష్టకరణం సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు సేవలు ప్రశంసనీయమని శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలిమహంతి ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఎంపీజీ ఈశ్వరరావు పుట్టిన రోజు వేడుకలను గుంటూరువారి వీధిలోని బృందావన్ అపార్ట్‌మెంట్ కమిటీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని పోలిమహంతి ఆవిష్కరించారు. ముందుగా నిరాశ్రయుల గృహంలో వృద్ధులకు అల్పాహారం అందించడంతో ఆయన కుటుంబ సభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా జిల్లాలో శిష్టకరణ సంఘం బలోపేతానికి ఎంతో నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. నేడు జిల్లాలో శిష్టకరణ సంఘం గుర్తింపు రావడానికి ఆయన సేవలే ప్రధానమన్నారు. విద్యావేత్త డాక్టర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సుధారాణి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆయన అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సింహగిరి పట్నాయక్, కృష్ణ, తిరుపతిరావు, త్రినాథ్‌ప్రసాద్, ధనుంజయ, వెంకట రమణారావు, కనకల రఘురామారావు, సుధారాణి చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి ఎంపీ ఊపేంద్ర, కోశాధికారి శిరీష, ఈశ్వరరావు సతీమణి ఉమ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గరివిడి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడూరు పంచాయతీలోని 132 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం సాయంత్రం తాత్కాలిక ఉద్యోగులు ఆందోళనకు దిగారు. కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అర్థాంతరంగా ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని వారు ఆక్షేపించారు. ఉద్యోగులకు మద్దతుగా గరివిడి, కోడూరు గ్రామపెద్దలు నిలిచారు. ఇక్కడ తాత్కాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులు కోడూరులోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమకు చెందినవారు. ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు ఇక్కడ ఉద్యోగులను నియమించే ప్రక్రియను ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ కోడూరులో కొత్తగా కొంత మంది ఉద్యోగులను నియమించారు. దాంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లోకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. సాయంత్రం 6 గంటల వరకు పలు దఫాలుగా గ్రామ పెద్దలు, విద్యుత్ అధికారుల మధ్య చర్చలు జరిగాయి. వా రం తర్వాత ఇదే విషయంపై చర్చకు ఇరువర్గాలు నిర్ణయించుకున్నాయి.

చోడి సాగుకు సిద్ధం కండి

గజపతినగరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులు చోడిపంట సాగుకు సమాయత్తం కావాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు సూచించారు. గురువారం శ్రీరంగరాజపురం, ఎం.వెంకటాపురం గ్రామాల్లో ఈ-పంట సూపర్ చెక్ సందర్భంగా మొక్క జొన్న పంటలను పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో చోడి సాగుకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో ధనలక్ష్మి ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మెరకముడిదాం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుబిల్లి, యాడిక పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో జి.భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడారు. సమయ పాలన పాటించాలని టెక్నికల్ సహాయకుల సూచనలతో పనులు చేపడితే కనీస వేతనం పొందే అవకాశం ఉంటుందన్నారు.

ప్రమాదాల మలుపు

సంతకవిటి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంతకవిటి నుంచి హోంజరాం వైపు వెళ్లే రహదారి దారిలో పోతలజోగుపేట సమీపంలో మలుపు ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఇక్కడే ఓ ఇసుక లారీ గుంతలో పడింది. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేయడంలేదు. రహదారి పక్కన రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఉంది.



ప్రమాదకరంగా పోతలజోగుపేట వద్ద రోడ్డు

భార్యను హత్య చేసిన భర్త

క్రైం న్యూస్

●పరారీలో నిందితుడు



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు గణేశ్

దత్తిరాజేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భార్యను భర్త హతమార్చిన ఘటన గురువారం దత్తిరాజేరు మండలంలోని చుక్కపేటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చుక్కపేటకు చెందిన గౌరమ్మ, సత్యం ఇద్దరూ భార్యాభర్తలు. సత్యం రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. అప్పుడప్పుడు కొడుతూ ఉండేవాడు. ఏరోజైనా మారకపోతాడా అనే ఆశతో భర్త వేధింపులను ఆమె భరించేది. ఎప్పటిలాగే మూడురోజుల కిందట కూడా భార్యతో సత్యం గొడవకు దిగాడు. కాగా గురువారం రోజూ మాదిరిగానే గౌరమ్మ.. చుక్కపేట పక్క గ్రామం గుచ్చిమి సమీపంలో వరి పిలకలు కోయడానికి పనికి వెళుతుండగా ఆయిల్‌ఫామ్ తోట వద్ద కాపు కాసిన భర్త వెనుక నుంచి వచ్చి ఆమెపై కొడవలితో దాడి చేశాడు. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యం అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటరమణ, పెదమానాపురం స్టేషన్ ఎస్ఐ ఆర్.జయంతి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. మృతురాలు గౌరమ్మకు వివాహితులైన కుమారుడు గణేశ్, కుమార్తె భవాని ఉన్నారు. గౌరమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బొబ్బిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీఐ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ లాల్‌బీ (30) విజయనగరంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న తెర్లాం మండలంలోని సుందరాడ గ్రామానికి చెందిన రాగోలు అబి రోడ్డు దాటుతున్న వారిని ఢీకొన్నాడు. దీంతో కొమరాడ మండలంలోని గుమడ గ్రామానికి చెందిన షేక్ లాల్‌బీతో పాటు షేక్‌షాజలు గాయపడ్డారు. దీంతో లాల్‌బీ విజయనగరంలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. శవపంచాయతీ అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని ,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అబి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

చీపురుపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దన్నాన శ్రీనివాసరావు (31) మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. విజయరాంపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు బుధవారం రాత్రి మోటారు బైక్‌పై చీపురుపల్లి నుంచి గరివిడి వైపు వెళ్తున్నాడు. వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాపాలై అక్కడికక్కడే శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయాడు. ఎస్ఐ ఎల్.దామోదరరావు కేసు నమోదు చేశారు.

గరివిడిలో చోరీ

గరివిడి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలోని జగనన్న కాలనీలో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన బానిస సతీష్ తన కుటుంబంతో ఈనెల 2న క్యాంపు వెళ్లారు. తిరిగి 5న ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బెడ్‌రూంలో బీరువా తెరచి అందులో ఉన్న 2 ఉంగరాలు ఒక్కొక్కటి పావు తులం, రూ.5 వేలు అపహరణకు గురైనట్టు గుర్తించి గరివిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లోకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

సెల్ పాయింట్‌లో..

బలిజిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బలిజిపేటలోని సప్తగిరి సెల్ పాయింట్‌లో సుమారు రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీకి గురయ్యాయి. గురువారం తెల్లవారుజామున చిలకలపల్లి రోడ్డులో ఉన్న సప్తగిరి సెల్‌షాప్ షట్టర్‌ను పగులకొట్టి లోపలకు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఎనిమిది సెల్‌ఫోన్లు, నాలుగు బ్లూటూత్‌లు అపహరణకు గురయ్యాయని షాపు యజమాని రవ్వ శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బలిజిపేట ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు.

48 మద్యం సీసాల స్వాధీనం

కురుపాం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా మద్యం విక్రయిస్తున్న తోయక శ్రీకాంత్‌ను దుడ్డుఖల్లులో అదుపులోకి తీసుకుని అతడి నుంచి 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం

బాడంగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాయనివలసకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తారకేశ్వర్ తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి సత్యం బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదని ఆయన కుమారుడు దాసరి రమణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సెంచూరియన్‌లో వర్క్‌షాప్ ప్రారంభం




మాట్లాడుతున్న డా.భీష్మనారాయణ రథ్

నెల్లిమర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బయోవియా డిస్కవరీ స్టుడియో ఆధారిత హ్యాండ్స్ ఆన్‌వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ అండ్ బయో సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా రిసోర్స్ పర్సన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భీష్మనారాయణ రథ్ పాల్గొన్నారు. డ్రగ్ డిస్కవరీ, లైగాండ్- టార్గెట్ ఇంటరాక్షన్, డాకింగ్ ప్రక్రియను ప్రాక్టికల్ డెమోతో ప్రారంభించారు. డీన్ డాక్టర్ సన్నిడియోల్ డ్రగ్ డిస్కవరీ, బయో ఇన్ఫర్మేటిక్స్, కంప్యూటేషనల్ బయోలజీ రంగాల్లో ఉద్యోగ అవకాశాల కోసం వివరించారు. డాక్టర్ నాగజోగయ్య, డాక్టర్ కోస్తవ, గౌరీశంకర్‌తో పాటు బీటెక్, బీఫార్మసీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిమెంట్ వ్యాపారులకు సత్కారం

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ హోటల్‌లో జిల్లాలోని సిమెంట్ కాంట్రాక్టర్లు, వ్యాపారులను గురువారం సత్కరించారు. కనకదుర్గా ఎంటర్‌ప్రైజెస్ డీలర్ సురేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అదానీ సిమెంట్ టెక్నికల్ హెడ్ ఏడుకొండలు, రాజమహేంద్రవరం సేల్స్ ఇన్‌చార్జి ప్రసాద్‌రెడ్డి, సేల్స్ అధికారులు ఉదయ్‌కిరణ్, సీఎస్ రావు, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న బాధితులు

దత్తిరాజేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెదమానాపురం 3వ రైల్వేలైన్‌లో ఇళ్ల కూల్చివేతను గురువారం నివాసితులు అడ్డుకున్నారు. 29 మంది ఇళ్లకు సరిగా నష్టపరిహారం చెల్లించ లేదని ఆరోపించారు. ఆ పరిహారం సొమ్ముతో ఇల్లు కట్టుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆందోళనకు దిగారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించకుండా అన్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి మాట్లాడుతూ కలెక్టర్, ఆర్డీవోకు ఇప్పటికే సమస్యను తెలియజేశామన్నారు. సర్పంచ్ గొటివాడ దాసు మాట్లాడుతూ బాధితులకు అధికారులు అన్యాయం చేశారని, నిలువనీడ లేకుండా చేశారన్నారు. వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇక్కడ చెరువులుండేవి!

(5వ పేజీ తరువాయి)

లాభం కంటే నష్టమే జరుగుతోంది. ప్రతి ఏటా చెరువు గర్భం లోతు చేయడం వల్ల నీరు చెరువుకే ఎక్కువ శాతం పరిమితమైపోతుంది. ఎందుకంటే మదుములు ఎత్తులో ఉండిపోయేలా ఆ పనులు జరుగుతున్నాయి. ఆ చెరువు పనులు రెవెన్యూశాఖ ఇచ్చిన హద్దుల ప్రాప్తికి ఆక్రమణలు తొలగించి ఎత్తయిన గట్టు వేస్తే చెరువుల ఆక్రమణల శాతం తగ్గుతుంది.

పరిశ్రమల వివరాలు ఇవ్వాలి: కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి సమగ్ర వివరాలను ఇవ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో సర్వేను నిర్వహించారు. ఈసందర్భంగా పేపర్ ప్లేట్లు, పరుపుల తయారీ పరిశ్రమలను సందర్శించి యజమానులతో మాట్లాడారు. ఉత్పత్తుల తయారీకి వినియోగించే ముడి సరుకులు, మార్కెట్‌లో ఉత్పత్తులను విక్రయిస్తున్న విధానాలపై ఆరాతీశారు. పరిశ్రమలు సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా సమాచారాన్ని సేకరించాలని, గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరి శ్రమల అధికారిఎం.వి.కరుణాకర్, ఐపీఓవికె వర్ధన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పి-4 మోడల్

పార్వతీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) కీలకమైన సాధనమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేటు రంగం ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదన్నారు. పి-4 వనరుల సద్వినియోగానికి, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడు, జిల్లా వైద్య శాఖాధికారి భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, జిల్లా ప్రణాళికాధికారి పి.వీరరాజు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న పెదబొండపల్లి, ఎమ్ఆర్‌నగర్ గ్రామస్థులు

బెలగాం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెదబొండపల్లి, ఎమ్ఆర్‌నగర్ గ్రామాల్లో తాము సాగుచేస్తున్న భూములను ఆక్రమించిన మహిళపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దళితులు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళితులకు మద్దతుగా కూటమి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, వంగపండు త్రినాథరావు తదితర నాయకులు నిరసనకు మద్దతు తెలిపారు. ఆక్రమణకు గురైన దళితుల భూములపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దళితులు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి తాము సాగు చేసుకుంటూ వస్తున్న భూములను చుక్క శ్రీదేవి వైసీపీ హయాంలో ఆక్రమించిందని, ఈ విషయంపై అడిగితే దాడులకు దిగుతోందని వాపోయారు.తమపై కేసులు పెట్టి మానసిక క్షోభకు గురిచేస్తోందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆశ్రయించామని, ఆయన విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీఇచ్చారని చెప్పారు. అధికారులు స్పందించి విచారణ జరిపి భూములు అప్పగించాలని కోరారు.అనంతరం ఎమ్మార్‌నగర్, పెదబొండపల్లి గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు

పాలకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. గురువారం పాలకొండలోని నగర పంచాయతీలో పోస్టాఫీస్ రోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు.

కొట్టులో శివలింగం ప్రతిష్ఠ

కొమరాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగావళి తీరంలో ఉన్న కొట్టు గ్రామంలో శివాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజల నడుమ శివలింగాన్ని ప్రతిష్ఠించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు

సీతానగరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):సీతానగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల జేసీలు శోభిక, సేతు మాధవన్ భక్తి శ్రద్ధలతో ముడపుల పూజలను నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసచార్యులు, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జరిగేలా చూడాలి



రాజీవ్‌రంజాన్ మిశ్రాకు వినతి పత్రం అందజేస్తున్న విజయ్‌చంద్ర

పార్వతీపురం,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టి అందరికి సామాజిక న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర కోరారు.ఈ మేరకు వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు విజయవాడలో గురువారం వినతిప త్రం అందించారు. వర్గీకరణ జరిగితే ఏ విధమైన సామాజిక న్యాయం జరుగుతుందో సభ్యులతో చర్చించారు.

ఒడిశా

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

రాయగడ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి)6: నిరుద్యోగులు అవకాశాలు అందిపుచ్చుకుని ఉపాధి పొందాలని ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక కోరారు. గురువారం స్థానిక జీసీడి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఒడిశా ప్రభుత్వ నైపుణ్యా భివృద్ధి, వృత్తివిద్యాశాఖ తరపున నిర్వహించిన నిరుద్యోగ ఉపాధి మేళా రిక్రూట్ మెంట్ కార్యక్రమంలో మాట్లాడారు.జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఎంప్లాయిమెంట్ అధికారి తత్వమషి మహాపాత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 28 మందికి వివిధ పరిశ్రమల్లో ఉపాధి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు అధికారులు, రాయగడ ఒర్మాస్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మనోజ్ పాన్, వినాయక ఇంజనీరింగ్ చీఫ్ నరేన్ కుముందాన్ ఎంఎస్ఎంఈ జిల్లా అధికారి కోటరత్నంతో, గోపాలపట్నం, ఆర్మీ రిక్రూట్‌మెంట్ సెంటర్ మేజర్ కళ్యాణ రెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ వయస్సు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న మిషన్‌శక్తి సభ్యులు

రాయగడ,ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి):స్థానిక బాలంకేశ్వర శివాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సమస్యలు పరి ష్కరించాలని ఒడిశా జీవికా మిషన్, మహి ళా సభ్యులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచాలని, ఎవరైనా మరణిస్తే రూ.5 లక్షలు నష్టపరిహారం అందజేయాలని కోరారు.అనంతరం అదనపు కలక్టర్ నవీన్‌చంద్రకు అందజేశారు.

పర్యవేక్షణ లేక.. పలకలు ఏర్పాటు చేయక

● పొంచి ఉన్న ప్రమాదం ● కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్వాసన

● ఇదీ పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు పరిస్థితి



కాలువపై పలకలు లేని దృశ్యం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు ఉన్న డ్రైనేజీపై కాలువకు చాలా చోట్ల పలకలు లేవు. ఇక్కడ పలకల ఏర్పాటుచేయడంపై మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. దీంతో ఆదమరిచి రాకపోకలు సాగిస్తున్న వారు కాలువలోకి పడిపోతున్నారు. పలకలు లేకపోవడంతో ప్రమాదం పొంచిఉందని అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పల కల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. దీనికితోడు ఇక్కడ కాలువలో రోజుల తరబడి వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో డ్రైనేజీపై పలకలు లేకపోవడంతోపాటు కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోవడంతో అవస్థలకు గురవుతున్నామని చిరువ్యాపారులతోపాటు పలువురు వాపోతున్నారు. కాగా డ్రైనేజీపై పలకలు ఏర్పాటుతోపాటు కాలువల్లో వ్యర్థాల తొలగింపు సమస్యకు పరిష్కారం చూపిస్తామని ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరురాజు చెప్పారు.

స్టెమిచికిత్సతో గుండె జబ్బు రోగులకు భరోసా

● కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శోభారాణి



కురుపాం: స్టెమిచికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కురుపాం,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): స్టెమిచికిత్సతో గుండె జబ్బుల రోగులకు భరోసా లభిస్తుందని కురుపాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.శోభారాణి తెలిపారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటు వల్ల వచ్చే మరణాలను అరికట్టేందుకు స్టెమిచికిత్సపై ప్రజలకు, ఆశవర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు సునీల్, సందీప్, సాయి ప్రసాద్, మౌనిక పాల్గొన్నారు.

●పాలకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే ఇంజెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు తెలిపారు. ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.

● గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండెజబ్బులు మరణాలను నివారించేందుకు స్టెమి చికిత్స భరోసాను కల్పిస్తుందని భద్రగిరి సీహెచ్‌సీ వైద్యురాలు త్రివేణి తెలిపారు.గురువారం గుమ్మలక్ష్మీపురంలో స్టెమిగుండెకు అవగాహన కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఛాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండెదడ, నీరసంగా ఉండడం, స్పృహ కోల్పోయి వంటి లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

●జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కనకదుర్గ

బెలగాం, 6 ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నివారణకు కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ తోట కనకదుర్గ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సీడీపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారణకు జీవో -31, 39 ప్రకారం స్టేషన్ హౌస్ ఆఫీసర్, మహిళా సంరక్షణ కార్యదర్శులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణకు అక్కడ సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. అనంతరం ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ మాధవరెడ్డి, పీడీ కనకదుర్గలు బాలల సంరక్షణ, లైంగిక దాడులు నివారణకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

శీతల గిడ్డంగులను వినియోగించుకోవాలి

వీరఘట్టం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):శీతల గిడ్డంగులను రైతులు వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని, పండించే పంటలు నిల్వ చేసుకొని అధిక ధరలకు అమ్ముకొనేలా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఉద్యాన అధికారిని బి.శ్యామల కోరారు. గురువారం వీరఘట్టంలో ఎఫ్‌పీవో నిర్మించిన కలెక్షన్స్ సెంటర్, శీతల గిడ్డంగులను తనిఖీ చేశారు.కార్యక్రమంలో ఎఫ్‌పీవో అధ్యక్షుడు కరణం చిన్ననాయుడు, మండల సమైక్య ఏపీఎం కె.రాము, వీరఘట్టం ఉద్యాన అధికారులు అమరేశ్వరి, సీసీ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామలాంబ అమ్మవారి ఘటాల ఉరేగింపు



ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

సాలూరు,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోనుమహంతి, నెయ్యిల, ముత్తరాసు, కొంకివీధి, వేద సమాజం, వెల్లంకి, బ్రాహ్మణ వీధుల్లో శ్యామలాంబ అమ్మవారి పండుగ పురస్కరించుకుని గురువారం అమ్మవారి ఘటాలను జన్నివీధిలో ఉన్న అమ్మవారి గద్దె నుంచి ఉరేగించారు. అనంతరం మహిళలు ఘటాలకు పసుపు, కుంకుమతోపాటు మొక్కులు, ముడుపులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు, వెంకట రమణ, గొర్లె బానుజీరావు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు: సీఐ

సాలూరు,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహించినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జి.దాసు హెచ్చరించారు. గురువారం పట్టణంలో బార్లతో పాటు మద్యం షాపులను తనిఖీ చేశారు. అనం తరం విలేకరులతో మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు సంబంధించి శనివారం వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని, పదో తేదీన డ్రా తీయనున్నట్లు తెలిపారు.

ఫిర్యాదులను పరిష్కరించండి: సబ్‌కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

వీరఘట్టం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కు మార్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీసర్వే గ్రామ సభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించడంపై పరిశీలించారు. మండలంలో 3,144 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మణనాయుడు, వీఆర్‌వోలు ఉన్నారు.

పల్లెపండుగ పనులు పూర్తి చేయాలి

మక్కువ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. గురువారం స్థానికమండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో చెత్తశుద్ధి సంపద తయారీ కేంద్రాలను, పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సింహాచలం, జోగారావు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ నియామకంపై విచారణ జరపాలి

పాచిపెంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్జన్ గైనకాలజిస్టుగా ఉన్న డాక్టర్ వీఆర్ మీనాక్షిని సాలూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఎలా నియమించారని ఎంజీఎస్ఎస్ అధ్యక్షులు మంచాల ఈశ్వరరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆమె నియామకంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని కోరారు. కలెక్టర్, పీవోకు, మంగళగిరి మెడికల్ అండ్ హెల్త్ వారికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

11,12 తేదీల్లో మన్యం బంద్

సీతంపేట రూరల్,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సీపీఎం నాయకుడు ఎం తిరుప తిరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఈ నెల 11,12వ తేదీల్లో ఆదివాసీ అఖిలపక్షం, ప్రజా సంఘాల పిలుపు మేరకు 48గంటల పాటు మన్యంలో నిరవధిక బంద్ చేపడతామని తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియాలో 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలపై చట్టం చేయాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటి ఫికేషన్ ప్రకటించాలని, పాడేరు మెడికల్ కాలేజీలో పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

14న ఆశీలుపాట

పాలకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆశీలుపాట వాయిదా వేసినట్టు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ నగరపంచాయతీ పరిధిలోని రోజువారీ మార్కెట్, వారపు, పశువుల సంత, జంతువధశాల, కారు, బస్టాండ్, చెట్లు ఫలసాయానికి 2025-26లో ఆశీలు వసూళ్లకు ఈనెల ఆరో తేదీన నిర్వహిం చా ల్సిన ఆశీలపాట అనివార్య కారణాలు వల్ల వాయిదావేసినట్టు తెలిపారు. ఈనెల 14న ఆశీలపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): గీత కల్లు కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకోసం శనివారం లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, నివాస, కుల ధ్రువీకరణ, మూడు పాస్ ఫోటోలు, రెండు లక్షల డీడీతోపాటు ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్త్రీనిధితో ఆర్థికాభివృద్ధి

బలిజిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న స్త్రీనిధితో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని స్త్రీనిధి ఏజీఎం హేమలత తెలిపారు. బలిజిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తున్న రుణాలు, పొదుపు సంఘాల సభ్యులు సక్రమంగా వినియోగిస్తున్నది, లేనిది పరిశీలించాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ సమీనా బేగం, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

డిపోల్లోనే చింతపండు విక్రయించాలి

● జీసీఎం సొసైటీ సాలూరు మేనేజర్ రామారావు



గిరిజన రైతులు సేకరించిన చింతపండును పరిశీలిస్తున్న మేనేజర్ రామారావు

మక్కువ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీసీసీ డిపోల్లోనే గిరిజన రైతులు సేకరించే చింతపండును విక్రయించాలని జీసీఎం సొసైటీ సాలూరు మేనేజర్ జె.రామారావు కోరారు. గురువారం మండలంలోని దుగ్గేరు జీసీసీ డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపండుకు మద్దతు ధరను కేజీకిరూ.34 నుంచి రూ.36 పెంచినట్లు తెలిపారు. గిరిజన రైతులు దళారులు బారిన పడకుండా సేకరించిన చింతపండును జీసీసీలో విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. సాలూరు సొసైటీ పరిధిలోని ఐదు మండలాల్లో పది పీపీసీ సెంటర్లు, 36 డిఆర్ డిపోల ద్వారా చింతపండు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేల్స్‌మేన్ రమణ పాల్గొన్నారు.

చేపల పెంపకంపై దృష్టి సారించాలి

బలిజిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చేప పిల్లల పెంపకంపై మత్స్యకారులు దృష్టి సారించాలని ఏపీడీవో శీదేవి కోరారు.గురువారం మండలంలోపంచాయతీల పరిధిలోని 11 డిపార్ట్ మెంట్ చెరువుల్లో 147044 చేప పిల్లలను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీపై విడిచిపెట్టారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎల్లేటి శ్రీదేవి, మత్స్యకార సహకార సంఘ ప్రెసిడెంట్లు, గ్రామ మత్స్యసహాయకులు కీర్తిప్రియ, శంకరరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రహరీలకు నిధుల మంజూరు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు నిర్మాణాలకు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. మండలానికి సంబంధించి 25 పంచాయతీల్లో 14 ప్రహరీల నిర్మాణాలకు అంచనాలు తయారు చేసి మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదించారు. 14 పనులకు రూ. 1.64 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్‌లు తెలిపారు.

'సూర్యఘర్'తో విద్యుత్ పొదుపు: ఏఈ

భామిని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనతో వినియోగదారులు విద్యుత్‌ను పొదుపు చేయవచ్చని విద్యుత్ ఏఈ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయితీపై ఇంటిపై రూఫ్‌టాప్ ఏర్పాటుచేసుకుని విద్యుత్ బిల్లు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో సత్యం, హౌసింగ్ ఏఈ సీఎం చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ కె.కృష్ణారావు పాల్గొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో సోలార్ విద్యుత్‌పై విద్యుత్ సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ తయారు చేసుకోవచ్చని, ఇంటి అవసరాలు పోను గ్రిడ్‌కు విద్యుత్ అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి ఆదేశించారు. గురువారం మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తొలుత పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, గణితంలో ప్రావీణ్యాన్ని, పాఠశాల రికార్డులు, టాయిలెట్లును, విద్యార్థులకు అందజేస్తున్న భోజనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సిక్ రూముకు వెళ్లి అక్కడ అనారోగ్యంతో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. వీరికి ప్రత్యేకమైన భోజనం తయారు చేసి అందించాలని డిప్యూటీ వార్డెన్ శ్రీనివాసరావును ఆదేశించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలి

సీతానగరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు.మండలంలోని సూరంపేటలో ఏఎస్ఆర్ గోదామును పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బఫర్ గొడౌన్‌ను సందర్శించి అక్కడ స్టాకును పరిశీలించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: పీడీ

సాలూరు,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని మెప్మా పీడీ జీవీ చిట్టిరాజు కోరారు. గురువారం పట్టణంలో మెప్మా కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందేలా సిబ్బంది అందరూ పనిచేయాలని కోరారు. బ్యాంక్ లింకేజీ తీసుకున్న ప్రతి ఒక్కరూ వ్యాపారం పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, సీవో, డీఈవోలు, సీఎంఎం పుష్ప పాల్గొన్నారు.

దావా సమను

ము॥రా॥శ్రీ॥సాలూరు జూ॥సి॥జడ్జీకోర్టు వారి సముఖమునకు O.S.No.61/2024

Between:-
శ్రీ చప్ప రమేష్ .... వాది
And:
1.శ్రీ అంపావిల్లి సింహాచలం
2.శ్రీమతి అంపావిల్లి చిన్నారి } ప్రతివాదులు
To
1.శ్రీ అంపావిల్లి సింహాచలం వ.45 సం॥S/o సూర్యనారాయణ హిందూ కులవృత్తి సా॥ మూర్రవలస గ్రామం, మక్కువ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
2.శ్రీమతి అంపావిల్లి చిన్నారి వ.40సం॥ W/o సింహాచలం -Rest do-

పై నెంబరు దావాను వాది మీపై ప్రోనోటు బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేయగా సదరు దావాలో కోర్టువారు మీ ఉభయులకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పై కోర్టు నుండి పంపించినప్పటికీ ఉద్దేశ్య పూర్వకంగా సమన్లు తీసుకోనందున పై నెంబరు దావాలో కోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా దావా సమన్లు సర్వీసు అయ్యేలాగా ఆర్డరు జారీ చేసిరి. సదరు దావాలో మీయొక్క హాజరు నిమిత్తం తే॥13-02-2025దీ నాటికి వాయిదా అయివున్నది. సదరు వాయిదా నాడు ఉ॥10.30 నిలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలియపర్చవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్పు వెలువరించగలరని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

సాలూరు
తేది.07.02.2025

శ్రీ రేగు సూర్యనారాయణ,
వాది తరుపున న్యాయవాది
సెల్: 7382071863

